నేడు అరసవల్లి హుండీ లెక్కింపు

ఇఒ డి.ఎల్.వి.రమేష్‌బాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని మంగళవారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో లెక్కించనున్నట్లు ఆలయ ఇఒ డి.ఎల్.వి.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు పేర్కొన్నారు. పటిష్ట భద్రత నడుమ ఈ లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

సాగునీటిపై ప్రభుత్వ నిర్లక్ష్యం



- 2014-19 వరకు రూ.1600 కోట్లు ఖర్చు చేశాం
- జగన్ ఐదేళ్లలో ఖర్చు చేసింది రూ.594 కోట్లే
- వైసిపి ఎమ్మెల్యేలకు దోపిడీపైనే దృష్టి
- 'రా కదలి రా' బహిరంగ సభలో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, రూరల్

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై వైసిపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపిందని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక 80 అడుగుల రోడ్డులో సోమవారం నిర్వహించిన రా కదలిరా బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఉత్తరాంధ్ర సృజల స్రవంతి ద్వారా గోదావరి నీళ్లు వంశధారకు అనుసంధానమైతే జిల్లాకు నీటి ఎద్దడి ఉండేది కాదన్నారు. టిడిపి హయంలో రూ.2 వేల కోట్లు మంజూరు చేస్తే... ఐదేళ్లలో జగన్ రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. జిల్లాలో ఉన్న శాసనసభ స్పీకర్‌కు, మంత్రికి సిగ్గు ఉందా? అని ప్రశ్నించారు. మహేంద్ర తనయా కోసం రూ.553 కోట్లు ఖర్చు చేస్తే... జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.26 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. తోటపల్లి ప్రాజెక్టుకు రూ.237 కోట్లు తాము ఖర్చు చేయగా, ఈ ప్రభుత్వం రూ.68 కోట్లు వెచ్చించిందన్నారు. వంశధార ఫేజ్-2కి రూ.420 కోట్లు ఖర్చు చేస్తే... ఈ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టు కోసం 2014-19 వరకు రూ.1,600 కోట్లు తాము ఖర్చు చేస్తే, వైసిపి ప్రభుత్వం ఖర్చు చేసింది కేవలం రూ.594 కోట్లు మాత్రమేనన్నారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంశధార, బహుదా నదులను అనుసంధానం చేసి ఆరు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. జీడిపిక్క రైతులకు గిట్టు బాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. పలాసలో డిఫెన్స్ కోచింగ్ సెంటర్, టెక్కలిలో ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. నర్సన్నపేట పరిధిలోని బొంతు లిఫ్ట్ ఇరిగేషన్, కామేశ్వరావుపేట ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామన్నారు. పలాస-కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్‌ను పూర్తి చేస్తామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వరకు బీచ్ రోడ్డును నిర్మించి పరిశ్రమలు ఏర్పాటుతో పాటు పర్యటక రంగాన్ని అభివృద్ధి చేసి ఉద్యోగ అవకాలు కల్పిస్తామని చెప్పారు. భావనపాడు పోర్టును లాలూచీ పడి ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సరిదిద్దుతామని చెప్పారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో మత్స్యకారుల కోసం జెట్టీ నిర్మిస్తామన్నారు. కళింగ వైశ్యులను ఒబిసిలుగా మార్చే బాధ్యత తనదన్నారు.

అభివాదం చేస్తున్న మాజీ సిఎం చంద్రబాబు నాయుడు

వైసిపి ఎమ్మెల్యేలకు దోపిడీపైనే దృష్టి

రెవెన్యూ మంత్రి ధర్మన ప్రసాదరావు శ్రీకాకుళాన్ని ప్రసాదంలా ఆరగిస్తున్నారని విమర్శించారు. ఇసుక రాంప్ వ్యవహారాలను కొడుకు చేతిలో పెట్టి అర్జన చేస్తున్నారని చెప్పారు. సావిత్రిపురంలో 67 ఎకరాల్లో భారీ లే అవుట్లు వేశారని, అందులో 23 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని అన్నారు. అరాచకానికి కేరాఫ్ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అని అసెంబ్లీకి రావడానికి అర్హత లేని వ్యక్తి అని విమర్శించారు. వ్యాపారుల నుంచి కమీషన్లు, పోర్టులో ఉద్యోగాల పేరుతో డబ్బులు గుంజుతున్నారని చెప్పారు ఆమదాలవలసలో శాసనసభ స్పీకర్ తమ్మినేని అక్రమార్జన కోసం జనంపైకి కొడుకుని, భార్యను వదిలారని చెప్పారు. నాగావళి-వంశధార నుంచి వచ్చే ఇసుక లారీకి రూ.6,000 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆమదాలవలసలో రూ.4 కోట్ల విలువైన 20 సెంట్ల భూమిని బెదిరించి లాక్కున్నారని చెప్పారు. పలాసలో మంత్రి అప్పలరాజు నియోజకవర్గాన్ని అడ్డంగా మింగేస్తున్నారని చెప్పారు. పలాసలో మళ్లీ గెలిస్తే కొండలే ఉండవన్నారు. పాతపట్నం నియోజకవర్గాని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఇసుక ట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ధర్నాన కృష్ణదాస్ ప్రయివేటు కాలేజీని బలవంతంగా ఖాళీ చేయించి కబ్జా చేశారని ఆరోపించారు తోటాడలో స్టోన్ క్రషర్ పేరుతో పదెకరాల భూమిని ఆక్రమించారని ఆరోపించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జిల్లాలోని వైసిపి ప్రజా ప్రతినిధులకు పరిపాలన చేతకాదన్నారు. జగన్ తన సొంత మనుషులకు ఉత్తరాంధ్రను అప్పగించారని విమర్శించారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు పది కిమీ రోడ్డు వేసుకోలేని దుస్థితిలో శాసనసబ స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మాన ఉన్నారని విమర్శించారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ మాట్లాడుతూ వంశధార నిర్వాసితులకు 2013 చట్టం అమలు, తిత్లీ పరిహారం ఇవ్వకుండా జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ కోడిరామ్మూర్తి స్టేడియంపై రాజకీయాలు చేసిన మంత్రి ధర్మాన ఇప్పుడు ఎందుకు పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. టిడిపి హయంలోనే మున్సిపాలిటీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు.

చంద్రబాబు ఘన స్వాగతం

జిల్లాకు వచ్చిన చంద్రబాబుకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలు నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, కలమట వెంకటరమణ, కొండ్రు మురళీమోహన్, నాయకులు పీరుకట్ల విశ్వప్రసాద్, జనసేన నాయకులు దానేటి శ్రీధర్ స్వాగతం పలికారు. సభలో పోలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు, మాజీ మంత్రి గుండ అప్పలసూర్య నారాయణ, పలు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు గౌతు శిరీష, నాయకులు గొండు శంకర్, జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల వైఫల్యం

చంద్రబాబు ముగిసిన తర్వాత జనం తీవ్ర ఇక్కట్లు పడ్డారు. సభకు వచ్చిన జనం గంటకు పైగా ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడ్డారు. జనం రద్దీ, వాహనాలన్నీ ఒకేసారి రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ముఖ్యంగా అరసవల్లి మిల్లు కూడలి వద్ద ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. సభకు వచ్చిన ప్రజలతో పాటు నగరంలోని వివిధ పనులపై వెళ్తున్న వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని పోలీసులపై అసహనం వ్యక్తం చేశారు. జనం భారీగా తరలివచ్చినా అందుకనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు సభ బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు జనం నియంత్రణ, ట్రాఫిక్ క్లియరెన్స్ తమ పని కాదన్నట్లుగా వ్యవహరించారు. చంద్రబాబు వేదిక నుంచి 80 అడుగుల రహదారిపై రాగానే అక్కడ ఎవరూ పోలీసులు లేకపోవడంతో ఒక్కసారిగా యువకులు కాన్వాయ్ వెంట పరుగులు తీశారు.

ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

రైస్, ఆయిల్ మిల్లు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం రైస్ అండ్ ఆయిల్ మిల్లు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, చైతన్య రైస్ అండ్ ఆయిల్ మిల్లు వర్కర్స్ యూనియన్ కన్వీనర్ హెచ్.ఈశ్వరరావు, కో-కన్వీనర్ కె.సూరయ్యలు హెచ్చరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరంలోని ఆర్అండ్‌బి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ప్రదర్శన నిర్వహించి అనంతరం మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రైస్ అండ్ ఆయిల్ మిల్లుల్లో ఐదు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, అతితక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల హాజరు వివరాలను యాజమాన్యాలు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ, 8 గంటల పనిదినం వంటి కార్మిక చట్టాలు యాజమాన్యాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలు అమలు చేయని డిమాండ్ చేశారు. ఐఎల్‌ఒ నిబంధనల ప్రకారం 50 కేజీలు బస్తా ఉపయోగించాలని, కానీ జిల్లాలో ఈ నిబంధనను పాటించకుండా 80 కిలోల బస్తాలను వినియోగిస్తున్నారని అన్నారు. దీనివల్ల అధిక బరువులు మోయలేక అనేక మంది అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. యాజమాన్యాలు కార్మికులతో అధిక బరువులు మోయించడంతో కార్మికుల అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. ధర్నాలో చైతన్య రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.కేశవరావు, జి.నీలన్న, ఎస్.ఆనంద్, బి.అప్పారావు, జి.గురువులు, పి.అప్పన్న, బి.కృష్ణారావు, పి.రమేష్, బి.రామారావు, బి.రాజారావు, జి.అప్పారావు పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎపిటెట్-2024 పరీక్షలు మంగళవారం నుంచి మార్చి 6వ తేదీ వరకు జరగనున్నాయని డిఇఒ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విలేకరులతో మాట్లాడారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు శ్రీకాకుళం జిల్లాలో మూడు కేంద్రాలు, ఒడిశా రాష్ట్రంలోని బరంపురంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల, నరసన్నపేటలోని మారుతీనగర్‌లో కోర్ టెక్నాలజీ కేంద్రాల్లోను, ఒడిశాలోని బరంపురంలో ఉన్న 10ఎన్ డిజిటల్, స్మిత్ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి ఐదు గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరగనున్నాయని అన్నారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు రాష్ట్ర పరిశీలకునిగా డాక్టర్ ఎస్.డి.వి.రమణను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. రెండు స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో టెట్ పర్యవేక్షణకు గ్రీవెన్‌సెల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సెల్‌లో ఎడి ఎం.శ్రీనివాసరావు 9703148269, పి.సంతోష్‌కుమార్ 7989139860, కె.శ్యామలరావు 9494004904 నంబర్లను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో జరిగే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, గంట ముందు అభ్యర్థులు కేంద్రాలను చేరుకోవాలని సూచించారు.

రాష్ట్ర భాగస్వామ్యం లేకుండా రైల్వే అభివృద్ధి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర భాగస్వామ్యం లేకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైల్వేస్టేషన్ల అభివృద్ధిని కొనసాగిస్తున్నారని పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ (ఆమదాలవలస)లో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని జాతిపిత మహాత్మాగాంధీ దూసి రైల్వేస్టేషన్‌లో అడుగుపెట్టిన ఘన చరిత్ర ఉందని, అదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్ అభివృద్ధికి నిరంతరం పార్లమెంట్‌లో పోరాటం చేశామని తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ భవన నిర్మాణంతో పాటు దూసి, ఊసవానిపేట రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి, నౌపడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.19 కోట్లు, ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.18 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఎపి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు రైల్వే సేవలు మరింత చేరువయ్యేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అమృత భారత్ స్టేషన్ల పథకం కింద పలు రైల్వేస్టేషన్లు మౌలిక సదుపాయాలకు నోచుకోవడం ద్వారా ప్రజాభిమానం చేరుకునే అవకాశం ఉందన్నారు. ఈ పథకం ద్వారా స్టేషన్‌లో సమావేశ మందిరాలు, ఇరువైపులా అప్రోచ్ రోడ్డు, పార్కింగ్ ఏరియా, పాదాచారులకు ప్రత్యేక దారి, ల్యాండ్ స్కేటింగ్ ఆధునిక లైటింగ్ వేగవంతమైన వైఫై సేవలకు 5జి టవర్లు వంటివి అందుబాటులోకి వస్తాయన్నారు. స్టేషన్ల వద్ద డ్రాకుల శుభ్రత సులభమైన నిర్వహణ కోసం బ్యాలెన్స్ లెస్ ట్రాకులు ఏర్పాటు నిర్మాణానికి నోచుకుంటాయన్నారు. వికలాంగులకు ప్రత్యేకంగా వీల్‌చైర్లు, ప్రత్యేక మార్గాలు ఇతర సదుపాయాలు వెయిటింగ్ హాల్స్ వాటికి అనుబంధంగా ఫుటేరియా వంటివి ఏర్పాటు అవుతాయన్నారు. ఇటువంటి అద్భుతమైన ఆలోచనకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. దూసి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు కావడంతో అక్కడా సోమవారం చీఫ్ ఇంజనీర్ వి.సాయిరాజ్ ఆధ్వర్యాన వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎడిఆర్ ఎం.గుప్త, బిజెపి జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఎస్‌సిసి సభ్యులు ఆనెపు రామకృష్ణ నాయుడు, ఎస్.నర్సింగరావు, రైల్వేస్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తాపా, రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఎల్. శివశంకర్ పాల్గొన్నారు.

పాల్గొన్న స్పీకర్ సీతారాం, ఎంపీ రామ్మోహన్‌నాయుడు

3న పల్స్‌పోలియో

శ్రీకాకుళం అర్బన్ : మార్చి 3న అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం తప్పని సరని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 4,5 తేదీల్లో మాపప్ రౌండు ఉంటుందన్నారు. జిల్లాలో 1,79,984 మంది ఐదేళ్లలోపు వయసు గల పిల్లలు ఉన్నారని, వారి కోసం 1232 పోలియో బూత్‌లు, 50 ట్రాన్సిట్ బూతులు ఏర్పాటు చేశామన్నారు. 78 మొబైల్ టీములు, 121 సూపర్‌వైజర్ బృందాలుగా ఏర్పడి 3,12,000 డోసులు వేయడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మొబైల్ టీములు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అన్ని సంచార జాతుల వారి పిల్లలకు, ఇటుక బట్టీలు నిర్వహించే వారి పిల్లలకు, నిర్మాణ స్థలాలు, మత్స్యకార గ్రామాల్లో వంద శాతం లక్ష్యంగా విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఈశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ విద్యాసాగర్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, రవాణా, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్యాబ్‌ల పంపిణీ

వికలాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన కళాశాల స్థాయిలో డిగ్రీ, పిజి చదువుతున్న వికలాంగులైన ఆరుగురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఒక్కరికి డైస్ ప్లేయర్ అందజేశారు. జెసి ఎం.నవీన్ మాట్లాడుతూ ల్యాప్‌టాప్‌లు అవసముంటే వికలాంగుల శాఖ ఎడి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ ఎడి కవిత పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

కాశీబుగ్గలో భారీ చోరీ

- రూ.10 లక్షల నగదు
- 15 తులాల బంగారం
- 4 కిలోల వెండి అపహరణ

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పోతనపల్లి వీధిలో నివాసముంటున్న కొత్తకోట రామ ఇంట్లో సోమవారం భారీ చోరీ జరిగింది. రూ.పది లక్షలు నగదు, 15 తులాల బంగారపు అభరణాలు, 4 కిలోల వెండి వస్తువులను దొంగలు అపహరించారు. కాశీబుగ్గ పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాశీబుగ్గకు చెందిన కొత్తకోట రామ మూడు రోడ్ల కూడలి వద్ద కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటలకే రామ కిరాణా షాపుకు వెళ్లిపోయారు. 11 గంటల సమయంలో రామ భార్య లక్ష్మీప్రవీణ, కుమారుడు లోచన్ కలిసి కాశీబుగ్గ మూడు రోడ్లు కూడలిలోని తన బంధువుల ఇంటిలో జరిగే శుభకార్యం కోసం ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి 11.45 నిమిషాలకు కొత్తకోట లోచన్ ఇంటికి సమీపంలో ఉన్న శారదానగర్లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఇంటికి వెళ్లారు. తిరిగి తమ సొంత ఇంటికి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు బద్దలుగొట్టి లోపలికి చొరబడినట్లు గుర్తించారు. తీరా లోపలికి వెళ్లే సమయంలో రెండు బీరువాలను బద్దలగొట్టి వాటిలోని బంగారం, నగదు, వెండి వస్తువులు దొంగలు తీసుకుపోయినట్లు గుర్తించారు. ఇంటి యజమాని రామకు సమాచారం అందించారు. ఇటీవల ఒక ప్రయివేటు చిట్ నుంచి రూ.పది లక్షలు ఇళ్ల నిర్మాణం కోసం తీసుకొచ్చామని, వాటినీ దొంగిలించికి పోయారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఒక్కసారిగా భారీ స్థాయిలో దొంగతనం జరగడంతో శ్రీకాకుళం నుంచి క్లూస్ బృందం వచ్చి దొంగతనం తీరును పరిశీలిస్తుండగా, మరో వైపు దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఎస్ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్‌కు వివరిస్తున్న తేజేశ్వరరావు

'స్పందన'కు 192 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పొందూరు మండలంలో కనిమెట్టలో మూడేళ్ల క్రితం మ్యూటేషన్ దాఖలు చేసినా ఇప్పటికీ పరిష్కరించలేదని అన్నెపు మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జెడ్‌పిలో సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తన తండ్రి వెంకటరమణ వివాహ సమయంలో పసుపు కుంకుమ కింద 0.19 సెంట్లు విస్తీర్ణం గల వ్యవసాయ భూమిని ఇచ్చారని అన్నారు. ఆ భూమిని తన పేరుతో మ్యూటేషన్ చేయాలని దరఖాస్తు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల జరిగిన రీ సర్వే సమయంలో అప్పటి ఇన్‌ఛార్జి తహాశీల్దార్‌ను కలిసి సమయంలో మ్యూటేషన్ కోసం విఆర్‌ఒను కలవాలని సలహా ఇచ్చారని అన్నారు. విఆర్‌ఒను కలిస్తే ముడుపులు కావాలని ఫిర్యాదులో ఆమె వివరించారు. ఇదే మండలంలోని రాందాసుపురంలో విశ్రాంత తహాశీల్దార్ శ్యామలరావుకు ఇలాంటి సమస్యే ఎదురైంది. తన భార్యకు అత్తవారు పసుపు కుంకుమ నిమిత్తం ఇచ్చిన 50 సెంట్లు వ్యవసాయ భూమిని రీ సర్వే సమయంలో తప్పుగా నమోదు చేశారని అన్నారు. 261 సర్వే నంబరులో ఉన్న ఈ భూమిని రీ సర్వే సమయంలో 260గా నమోదు చేశారని అన్నారు. సరిదిద్దాలని పొందూరు తహాశీల్దార్ కార్యాలయంలో అనేక మార్లు తిరిగినా ఇంతవరకు సరిచేయలేదని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ ఉద్యోగిగా సుదీర్ఘ కాలం సేవలు అందిన తనకే ఈ పరిస్థితి ఎదురైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే మండలం కొంచాడకు చెందిన గోలగాన రామినాయుడు, తండ్రి గోలగాన వెంకటరమణ తన భూమి హద్దు రాళ్లు సరి చేయాలని కోరారు. ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌లోను రీసర్వే లోపభూయిష్టంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. లోపాలను సరిదిద్దాల్సిన అధికారులు అక్రమ పద్ధతులను అనుసరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మందస మండలం హరిపురంలో పెద్దమాడి చెరువు సర్వే నంబరు 213-20 ఆక్రమణకు గురైందని, ఈ ఆక్రమణలు తొలగించాలని ఎంపిటిసి మాజీ సభ్యులు భైరిశెట్టి గున్నయ్య, పి.వాసు, పి.గణపతిరావు, కె.మహేశ్వరరావు, ఎం.జోగారావులు ఫిర్యాదు చేశారు. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లికి చెందిన కింజరాపు వెంకటరమణ 15వ ఆర్థిక సంఘం నిధులతో 2022లో మంజూరైన అభివృద్ధి పనులు పూర్తి చేసినా ఇంతవరకు బిల్లులు అందలేదని పేర్కొన్నారు. బకాయిలు చెల్లించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 192 వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈయనతోపాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడీ గణపతిరావు, ఇరిగేషన్ ఎస్ఇ డోల తిరుమలరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రానైట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

గ్రానైట్ క్వారీ పరిశ్రమల్లో యాజమాన్యాలు అక్రమంగా తొలగించిన 12 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో గ్రానైట్ క్వారీ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయాలని, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ జిల్లా పరిషత్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో టెక్కలి, కోటబొమ్మాళి, సారవకోట, పాతపట్నం, శ్రీకాకుళం రూరల్ మండలాల్లోని గ్రానైట్ క్వారీ పరిశ్రమలు 60 వరకు ఉన్నాయని అన్నారు. వాటిల్లో పనిచేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ, బోనస్సు, ప్రభుత్వం ప్రకటించిన సెలవులు, ఇతర కార్మిక చట్టాలు యాజమాన్యాలు అమలు చేయడం లేదని కలెక్టర్‌కు వివరించారు. రోజుకు 10 నుంచి 12 గంటల పాటు కార్మికులతో పని చేయిస్తున్నారని అన్నారు. చట్ట ప్రకారం ఓవర్ టైం వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులంతా తమ హక్కుల కోసం చట్టబద్ధంగా దుర్గామాత ప్రొక్లెయినర్ ఆపరేటర్ల యూనియన్ రిజిస్ట్రేషన్ చేసి కార్మిక చట్టాల అమలు చేయాలని కోరారు. స్టాగ్ మినరల్స్, ఆదిత్య మినరల్స్, ఐశ్వర్య గ్రానైట్, క్వారీ క్రాంతి గ్రానైట్, తిరుపతిరానా గ్రానైట్, భాగ్యలక్ష్మి గ్రానైట్, అర్చన గ్రానైట్ క్వారీ యాజమాన్యాలు 12 మంది కార్మికులను అక్రమంగా తొలగించాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో దుర్గామాత ప్రొక్లెయినర్ ఆపరేటర్ల యూనియన్ నాయకులు కరణం మధుబాబు, దవల గోపాలరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I undersigned **SURAVARAPU LAXMINARAYANA** (OLD NAME) S/O YARRAPPADU, DOOR NO : 1-348, POLAKI VILLAGE, POLAKI MANDALAMA, SRIKAKULAM DIST PIN :532429 CHANGING MY NAME FROM **SURAVARAPU LAXMINARAYANA (OLD NAME) TO SURAVARAPU. LAKSHMINARAYANA (NEW NAME)** hence fourth I am called as **SURAVARAPU LAKSHMINARAYANA** (new name)for all purpose.

మహారాజశ్రీ బొబ్బిలి అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు వారి దివ్యసముఖమునకు
I.A.195/2024 IN O.S.130/2020

పూడి సింహాచలం ....పిటీషనరు/వాది
ఎండ్:
టి.ఎన్.మూర్తి ......రెస్పాడెంటు/ప్రతివాది
To,
టంకాల నర్సింహమూర్తి తండ్రి సీతయ్య వయస్సు 45 సం॥లు, మోదుగ వలస గ్రామం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా

పై నెంబరు దావాలో యిందలి రెస్పాడెంటు/ప్రతివాదికు, కోర్డు నుండి ఎన్ని పర్యాయములు సమన్లు/ నోటీషులు పంపినను పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీషు అమలుకు సదరు దావాను తేది. 11-03-2024న కోర్టు వారు వాయిదా వేసి యున్నారు. కావున సదరు **తేది 11-03-2024న ఉదయం 10.30 గం॥**లకు పైన తెలిపిన కోర్టునందు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరు అయి, అక్షేపణలు ఉన్న ఎడల తెలుపు కొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు సదరు వాజ్యమును తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్వరు ప్రకారం)

జి.మహేష్
జి.కృష్ణ
వాది తరుపు అడ్వకేట్స్
బొబ్బిలి.

బొబ్బిలి,
తేది: 26/2/2024

పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

మండలం పాతర్లపల్లి పంచాయతీకి చెందిన పేద కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూముల లబ్ధిదారులకు పట్టాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సోమవారం క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు పంటలు పండించుకొని ఆర్థికంగా ఎదగాలని, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మండల విప్ బగ్గు రాజారావు, వైసిపి నాయకులు ముకా మేస్త్రి, అల్లు సూర్యనారాయణ, మండది రాము, వైసిపి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

జి.సిగడాం మండలం పెంట గ్రామానికి చెందిన మీసాల రాజారత్నం నాయుడు అనే బాధితుడుకు సిఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.లక్ష 10వేల చెక్కును ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఆపదలో ఉంటే నేనున్నానని ఆదుకోవడం సిఎం జగన్ మనసుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పెంట పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి పున్నాన అక్కలనాయుడు, వైసిపి నాయకులు మీసాల శ్రీనువాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న ఎపిటిఎఫ్ ప్రతినిధులు

6న జెడ్‌పి ఎదుట ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఏళ్ల తరబడి పేరుకుపోయిన పిఎఫ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో మార్చి 6 నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని ఎపిటిఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె. వెంకటేశ్వరరావుకు నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిఎఫ్ స్లిప్పులు గత కొన్నేళ్లుగా ఇవ్వడం లేదని, ఆన్‌లైన్ సర్వీసులు నిలుపుదల చేశారని, కనీసం మాన్యువల్‌గా ఉపాధ్యాయులకు పిఎఫ్ స్లిప్పులు అందించాలన్నారు. పిఎఫ్ ఖాతాలో దాచుకున్న సొమ్ము, పార్ట్ ఫైనల్, లోను రూపంలో తీసుకోవడానికి దరఖాస్తు చేస్తే నెలల తరబడి, సంవత్సరాల తరబడి వాటిని చెల్లించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. కారుణ్య నియామకాలు చేయాలని పేర్కొన్నారు. మెమొరాండం అందించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎవి అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శులు చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహనరావు, రాష్ట్ర కౌన్సిలర్ పైడి శ్రీరామమూర్తి, నాయకులు సదాశివుని శంకరరావు, బొడ్డేపల్లి మహేష్, ఎవి కామేశ్వరరావు, కె. మురళీధర్, జి.గోవిందరావు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న స్పందన ఫౌండేషన్ సభ్యులు

స్పందన ఫౌండేషన్ ఆర్థికసాయం

సంతబొమ్మాళి : జీవింప జీవితాన్ని ఇవ్వు అనే నినాదంతో పనిచేస్తున్న బడే కుప్పన్న పేటలో ఉన్న కెపి స్పందన ఫౌండేషన్ సోమవారం పోలాకి మండలం సొండిపేట గ్రామానికి చెందిన అనాథ బాలిక సింహాద్రి పార్వతికి వివాహం జరిపేందుకు తనవంతు సాయంగా రూ.15 వేలు ఆర్థిక సాయం అందించింది. పార్వతి తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోగా మావయ్య ఇంతవరకు బాగోగులు చూసాడు. తనకు కూడా ఇద్దరు కుమార్తెలు కావడంతో పార్వతి వివాహానికి ఏమైనా స్వచ్ఛంద సంస్థలు సాయం చేయాలని కోరగా స్పందన ఫౌండేషన్ ప్రతినిధులు వారి ఇంటికి వెళ్లి తమవంతు సాయాన్ని నగదును అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు షణ్ముఖరావు, సర్పంచ్ సర్పంచ్ భూషణ్ రెడ్డి, పల్లిరెడ్డి, బమ్మిడి విశ్వనాథం, స్వామి పాల్గొన్నారు.

రైల్వే చీఫ్ ఇంజనీర్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిరణ్ కుమార్

వంతెన నిర్మాణానికి వినతి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రత్తకన్న ఎల్‌సిగేట్ వద్ద ఎక్కువ సార్లు రైల్వే రాకపోకల నిమిత్తం గేటు వేస్తుండడంతో ప్రజలు, ప్రయాణికులు ఎక్కువ ఇబ్బందులను గురవుతున్నారని ప్రజలు సౌకర్యం కోసం రైల్వే బ్రిడ్జి నిర్మించాలని భువనేశ్వర్ చీఫ్ ఇంజనీర్ చంద్రమోహన్‌కు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ వినతిపత్రం సమర్పించారు. రైల్వే వంతెన లేకపోవడం, రైల్వే గేటు పడిన ప్రతిసారి గంటలు తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయన్నారు. ప్రజలు, విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి తరలించే రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రైల్వే బ్రిడ్జి నిర్మాణం వల్ల ఇక్కడ ప్రజలు సామాజిక, వ్యాపార, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల వారికి ఉపయోగం జరుగుతుందన్నారు. ఈయనతో పాటు బొడ్డు గాంధీ, ప్రతాపరావు, ప్రమోద్ ఉన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

టెక్కలి: విద్యారంగాన్ని సర్వనాశనం చేసే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్‌సి బాలుర వసతిగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతుందన్నారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు మార్పు చేసారన్నారు. ఆశాస్త్రీయ భావజాలాన్ని పాఠ్యాంశాల్లో చేర్చుతున్నారన్నారు. జిల్లా నాయకులు మహేష్, సునీల్ రాజు పాల్గొన్నారు.

ముగిసిన ఎఫ్‌ఎ-4 పరీక్షలు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాల్లో మూడు రోజులుగా నిర్వహించిన ఎఫ్‌ఎ-4 పరీక్షలు సోమవారంతో ముగిసాయి. విద్యాశాఖ అధికారులు ప్రశ్నాపత్రాలు హెచ్‌ఎం వాట్సాప్‌కి పంపితే వాటిని సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థులకు బోర్డు మీద ప్రశ్నాపత్రం రాసి అందించారు. ఒక్కపూటలోనే రోజుకు రెండు పరీక్షలు చొప్పున నిర్వహించడం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది.

నూకరాజుకు పరామర్శ

కొత్తూరు: మండలంలో మెట్టూరు ప్రాంతంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పిఎసిఎస్ డైరెక్టర్ కుంచాల నూకరాజు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా కోశాధికారి, పాతపట్నం నియోజకవర్గం నాయకులు లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు పారాపురంలో నూకరాజును సోమవారం పరామర్శించారు. ఆయన వెంట లోతుగెడ్డ భగవాన్ దాసునాయుడు, తాత బాబు, కడుబ సతిరుపతి, లోతుగెడ్డ కృష్ణ తదితరులున్నారు.

మద్దతు ధర చట్టం తీసుకురావాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

కేంద్ర ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థను బహిష్కరించాలని, రైతుల పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ డిమాండ్ చేశారు. రైతులు పండించే పంటలకు స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని, విద్యుత్ రంగ సంస్కరణలు నిలిపివేయాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్ రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపుమేరకు చిలకపాలెంలో ఆర్‌అండ్‌బి బంగ్లా నుంచి జాతీయ రహదారి వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా

ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

వారు మాట్లాడుతూ భారత రైతులకు వ్యతిరేకంగా ఉన్న డబ్యూటిఒ బాయికాట్ చేయాలని, హర్యానా, ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై కాల్పులు జరిపి యువరైతు మరణానికి కారణమైన హర్యానా పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. సమగ్ర పంటల బీమా అమలు చేయాలని చేయాలన్నారు.

దశాబ్దాలు పాటు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు కాలరాస్తూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చారని అన్నారు. 2021లో మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక రైతు ఉద్యమం సందర్భంగా రైతాంగానికి ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. విద్యుత్ రంగంలో కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న సంస్కరణలు నిలిపివేయాలన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీని బలోపేతం చేయాలన్నారు. రోజుకు రూ. 600 కూలి ఇస్తూ, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికెమ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.అశోక్, వై.గోపాల్, నారాయణపురం భూపోరాట కమిటీ కన్వీనర్ డి.నందోడు, కోరాడ అప్పన్న, పి.బుచ్చిరాజు, కె.గన్నెమ్మ, కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం సరుబుజ్జిలి మండలం కొత్తకోటలో రూ.60 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి రైతాంగానికి ప్రభుత్వం చేదోడు వాదోడుగా నిలుస్తుందన్నారు. ఈ క్రాఫ్ చేసుకున్న ప్రతి రైతు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే సిఎం ధ్యేయమన్నారు. రైతులు దళారులు, మధ్యవర్తుల చేతిలో నష్టపోకూడదన్న ఉద్దేశంతోనే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతుకు సంబంధించిన విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామని అన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి కెవిజి సత్యనారాయణ,

పిఎసిఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొవిలాపు చంద్రశేఖర్, వైస్ ఎంపిపి శివానంద బాబు, జిల్లా బిసిసెల్ డైరెక్టర్ ముడడ్ల రమణ, ఎస్‌సి సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, ఎంపిటిసి సురవరపు సింహాచలం పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- నరసన్నపేట

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ ఆర్.రామారావు అన్నారు. సోమవారం పద్మావతి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఓటు విలువను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశాలలో ఓటు అత్యంత విలువైనదని, అర్హత గలవారు తమ ఓటు హక్కును సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఫారం 6, 6ఎ, 7, 8పై అవగాహన కల్పించారు. ఓటు నమోదు కోసం, సవరణల కోసం ఆయా పోలింగ్ స్టేషన్ పరిధిలో గల బూత్ లెవెల్ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.వి.రమణ మూర్తి ఎన్‌ఎస్‌ఎస్ పిఒ రాములు, కళాశాల అధ్యాపకులు కె.సింహాచలం, వై.రాంబాబు, నెహ్రు యువక కేంద్రం వాలంటీర్లు ఉమామహేశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

ఒత్తిడిని అధిగమించాలి

ప్రజాశక్తి- కవిటి

ఒత్తిడిని అధిగమించి ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పేడాడ రాజేశ్వరరావు సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వెల్ నెస్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'స్ట్రెస్ మేనేజ్మెంట్' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. వెల్ నెస్ క్లబ్ కౌన్సిలర్ జె.పాపారావు విద్యార్థులకు పరీక్షలు ముందు, పరీక్షలు జరుగుతున్న సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన సూచనలు చేశారు. శారీరక, మానసిక, ఆరోగ్యం చాలా ముఖ్యమని, వాటిని కాపాడు కోవడానికి విద్యార్థులు ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.హరి, బి. శ్రీను బాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే ఛార్జీల రాయితీ పునరుద్ధణపై హర్షం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

పాసింజర్ రైళ్లలో టికెట్ ధరలను 50 శాతం తగ్గించడంపై మండలం బోరుభద్రకు చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న హర్షం వ్యక్తం చేశారు. మూడేళ్ల క్రితం కోవిడ్ వ్యాప్తి ఉన్న సమయంలో రైల్వే సాధారణ పాసింజరు ట్రైన్‌లను స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లుగా మార్పుచేస్తూ సెకండ్ క్లాస్ (అన్ రిజర్వడ్) తరగతి టికెట్టు ధరను 50 శాతం పెంచారని, ఇప్పుడు కోవిడ్ పూర్తిగా తగ్గుముఖం పట్టినప్పటికీ పాసింజర్ ట్రైన్‌లో పెంచిన ధరలనే కొనసాగించటంతో పేద, మధ్యతరగతి, దినసరి కూలీలు తదితరులకు ప్రయాణం భారంగా మారిందన్నారు. పెంచిన టికెట్ ధరలను తగ్గించాలని కోరుతూ రైల్వే మంత్రి, పిఎం కార్యాలయానికి, రైల్వే ఉన్నతాధికారులకు పలు ధపాలుగా వినతిపత్రాలు సమర్పించటం జరిగిందని తెలిపారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ అన్ని పాసింజర్ ట్రైన్‌లలో టికెట్ ధరలను 50 శాతం తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

10 వేల మందితో ర్యాలీ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

శ్రీకాకుళంలో రాష్ట్ర టిడిపి అధినేత నారా చంద్రబాబు సోమవారం సాయంత్రం నిర్వహించే రా... కదలిరా కార్యక్రమానికి టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలతో సుమారు 10వేల మంది కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. అచ్చెన్నాయుడు మోటర్ సైకిల్ నడుపగా రామ్మోహన్‌నాయుడు వెనుక కూర్చున్నారు. ఈ ర్యాలీతో కోటబొమ్మాళి మండల కేంద్రంతో పాటు జాతీయరహదారి పొడవున పసుపుమయిమైంది.

ర్యాలీ నిర్వహిస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు తదితరులు

సైన్స్ ప్రయోగాల్లో 'విశ్వశాంతి' విద్యార్థుల ప్రతిభ

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి

ప్రజాశక్తి- పోలాకి

సైన్స్ పరిజ్ఞానం ద్వారా ప్రయోగాలు చేసి ప్రోజెక్టులు తయారీలో విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థులు కనపర్చిన ప్రతిభ అద్భుతమని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి అన్నారు. సోమవారం పోలాకి విశ్వశాంతి హైస్కూల్‌లో డైరెక్టర్ ఎం.ఊర్మిళ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్పో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన మోడల్ చంద్రయాన్-4, ది క్రాప్స్ గెయిన్ ఫ్రమ్ రెయన్స్, ప్రోజెక్టులను వివరించే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 80 ప్రాజెక్టలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వశాంతి హైస్కూల్ అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిజ్ఞానం ఉపయోగంలో జిల్లాలో ఉత్తమ ఐదు పాఠశాలల్లో విశ్వశాంతి మొదటి స్థానంలో ఉందన్నారు. పాఠశాలకు ప్రభుత్వం తరుపున సహాయ సహకారం అందించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమార్ స్వామి మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్ విధానం ద్వారా విద్యార్థులు చేసే ప్రయోగాలు నేటి ఇంజినీర్లుతో సమానంగా ఉన్నాయని వీరి ప్రతిభ అభినందనీయమన్నారు. ఈ నెల 28న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ టెక్కలి ఐతం కాలేజీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమార్ స్వామి, పాఠశాల నిర్వాహకులు మెట్ట జనార్దనరావు, అప్స్ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఐ.గణపతిరావు, రాష్ట్ర కౌన్సిల్ కో-ఆర్డినేటర్ రామ్మోహనరావు, ఎంఇఒలు శ్రీనివాస్, లింగరాజు, హెచ్‌ఎం చంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలను పరిష్కరించాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో రైల్వేస్టేషన్ వద్ద సోమవారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌ల అభివృద్ధికి వర్చువల్ ప్రారంభంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం అమృత్ భారత్ కింద ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఎల్సీ గేట్ వద్ద వంతెన నిర్మాణం, తోటవీధి వద్ద అండర్ పాస్ వే నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ అర్ అర్. దాస్, బిజెపి నేతలు ఆశీ సత్యం, వి కె.ప్రసాద్, మంగి ధనలక్ష్మి, టిడిపి నేతలు లీలా రాణి, కాళ్ల జయదేవ్, సాలీనా ఢిల్లీ, నందిక జాని, కాళ్ల దిలీప్ కుమార్, పత్రీ తవిటయ్య పాల్గొన్నారు.

టెక్కలి : రైల్వే ప్రయాణికులకు అందుబాటులోకి రైల్వే సేవలు విస్తరించనున్నామని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. నౌపడ రైల్వే జంక్షన్ ఆధునికీకరణలో భాగంగా

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

సోమవారం జరిగిన కార్యక్రమంలో రామారావు పాల్గొన్నారు. అమృత భారత్ స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోడి వర్చువల్ విభాగంలో ఆధునికీకరణ చేయనున్నామని తెలిపారు. టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, రైల్వే చీఫ్ ఇంజనీర్ టి.రాంసింగ్, సీనియర్ ఇంజినీరింగ్ అధికారి ఎస్.సత్యనారాయణ, జగన్నాథం పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ సింధు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస : ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ఆర్.సింధు అన్నారు. సోమవారం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర ఐటిఐలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు లావాదేవీల పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే సమాచారం ఇవ్వవద్దన్నారు. ఎటిఎంలో అపరిచితులకు ఎటిఎం కార్డు ఇచ్చి డబ్బులు డ్రా చేయించరాదన్నారు. బ్యాంకులో అమలవుతున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకానికి ఏడాదికి రూ.436 చెల్లిస్తే సహజ మరణానికి రూ.2 లక్షల బీమా నామినీకి అందుతుందన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. బ్యాంకు సిబ్బంది లోపాలపై ఫిర్యాదు చేయాలంటే ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఐటిఐ కరస్పాండెంట్ కూన బానోజీరావు, కూన రాజేష్, ప్రిన్సిపాల్ ప్రసాదరావు, లెక్చరర్ శ్రీనివాసరావు, సిఎఫ్ఎల్ సిబ్బంది చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), రామారావు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

క్రీడాకారులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పెదవంక - బాతుపురంలో మూడు రోజులుగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించిందన్నారు. ఈ టోర్నీలో 28 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా సచిన్ స్పోర్ట్స్, యువతరం సేవా సమితి, బాతుపురం జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలుగా

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

నిలిచిన జట్లకు షీల్డ్‌తో నగదు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపెల్లి ఉదయ్ కుమార్, సర్పంచ్ బత్తిని సృజన, బత్తిని లక్ష్మీనారాయణ, తాతారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇంటి పత్రాలను బ్రాహ్మణుడికి అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ఇంటి స్థలం విరాళం

సోంపేట: పట్టణానికి చెందిన నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అనిల్ పాణిగ్రహికి సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు తన తండ్రి జ్ఞాపకార్థం రూ.12 లక్షల విలువ చేసిన ఇంటి స్థలాన్ని విరాళంగా అందజేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సోంపేట పట్టణంలో రోటరీ క్లబ్ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీనివాసరావు పట్టణం నేతాజీ నగర్‌కు చెందిన నిరుపేద బ్రాహ్మణుడు అనిల్ పాణిగ్రహికు విశ్రాంత రోటరీ గవర్నర్ పిడిజి కిషోర్ కుమార్ చేతులమీదుగా ఇంటి స్థలాన్ని అనిల్ పాణిగ్రహి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను అందజేయడంతో రోటరీ క్లబ్ ప్రతినిధులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ విశ్వగురు వరల్డ్ రికార్డ్ గ్రహీత దుద్ది శ్రీనివాసరావు దంపతులకు ఘనంగా సన్మానం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కోటబొమ్మాళి: వివిధ భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు రీ భూసర్వే ద్వారా అధికారులు పరిష్కరించాలని సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ప్రజలు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భూముల విషయంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కరం కాని సమస్యలు ఉన్నాయని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు, రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో విఆర్ఒ పేడాడ అకిల్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాలిబూడిదవుతున్న గడ్డివాములు

గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం తిర్లంగిలో సోమవారం గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు రావడంతో గ్రామస్తులు,. పక్కనే ఉన్న సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భయాందోళన చెందారు. సాకిపల్లి రాజు, మార్పు కామేష్, మార్పు రామారావు, వజ్జ సోమేష్, లకినేని నారాయణరావు, కోనారి బద్రమ్మ పశువుల దాణా కోసం గడ్డి వాములు కొనుగోలు చేసి కుప్పలుగా వేసుకున్నారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అగ్నిమాపక శకటం వచ్చే సరికి గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన ఆకతాయిల పనేనని గ్రామస్తులు అంటున్నారు.

చంద్రపతిరావు లేని లోటు పూడ్చలేనిది

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బిసిలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కోసం నిరంతరం తపన పడే వ్యక్తి చంద్రపతిరావు అని, బిసి ఉద్యమంలో ఆయన లేని లోటు పూడ్చలేనిదని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, బిసి ఉద్యోగుల హక్కులపై చంద్రపతి అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాగ వెంగళరావు, జెఎన్‌టియు పాలక మండలి సభ్యులు బుడుమూరు రాజేష్, బిసి సంఘం కార్యదర్శి బాడాన దేవభూషణరావు, గద్దెబోయిన కృష్ణ, గంజి ఆర్ ఎజ్రా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగభూషణరావు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పొందూరు

ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరికి అవగాహన అత్యవసరమని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం జిల్లా రీసోర్స్‌పర్సన్ హెచ్.నాగభూషణరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎపి శాక్స్ సహకారంతో జిల్లా హెచ్ఐవి నివారణ, నిర్మూలన సంస్థ స్థానిక సిస్టం డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్, టిబి, రక్తమార్పిడిపై అవగాహన కల్పించారు. యుక్తవయసు నుంచే మంచి అలవాట్లు, నడవడికను కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసర కళావేదిక చక్రపాణి బృందంతో పాటలు, కథల రూపంలో ఎయిడ్స్, టిబిపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ నాగవల్లి, సిఎఫ్ఐఎల్ డబ్ల్యుఎస్ సిబ్బంది ఆదినారాయణ, ఉమాశంకర్, ఉష, రామలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలలో అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఇఒ

పాఠశాలలో వార్షిక తనిఖీలు

ఇచ్ఛాపురం: పట్టణంలో బ్రాహ్మణ వీధి తెలుగు (అభ్యుదయ) పాఠశాలను ఎంఇఒ కురమాన అప్పారావు పాఠశాల వార్షిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థుల అభ్యసన పఠనా సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్ పరిశీలించారు. వార్షిక విద్యా కేలండర్ ప్రాప్తికి విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను సూచించారు. మనబడి నాడు నేడు అభివృద్ధి పనులు పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీలో సిఆర్ ఎంటి దేవరాజు, సోమేశ్వరరావు, సత్య నారాయణ, తులసిరావు, మోహనరావు, రవికుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయస్థాయి 'హేక్‌తాన్'

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా ఈనెల 27 నుంచి 29 వరకు జాతీయ స్థాయిలో 48 గంటల హేక్‌తాన్ నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నూతన హేక్‌తాన్ పోటీలో ఎంపికైన మూడు ఉత్తమ ప్రాజెక్టలకు రూ.2.50 లక్షల వరకు నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. ఐతమ్, గ్రీక్సరిక్స్ కంపెనీలు సంయుక్తంగా నిర్వహించే ఈ హేక్‌తాన్‌కు పలు కంపెనీలు సహాయ సహకారాలు అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఎపి, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, తదితర రాష్ట్రాలకు చెందిన యూనివర్శిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వెయ్యి మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు.

సున్నా వడ్డీ జాబితా ప్రదర్శన

ఇచ్ఛాపురం: ఖరీఫ్-2021-22, రబీ-2021-22కు సంబంధించి సున్నా వడ్డీ పంట రుణాల జాబితా బెల్లుపడ రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించినట్టు వ్యవసాయ అధికారి భార్గవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రాల వద్ద సున్నా వడ్డీ పంట రుణాల జాబితా ప్రదర్శించడం జరిగిందని, ఖరీఫ్ 2021-22కు సంబంధించి మండలం మొత్తం 1168 మంది రైతులకు రూ.14,43,786 లక్షలు, రబీ 2021-22కు సంబంధించి మొత్తం 1539 మంది రైతులకు రూ.31,75,845 లక్షలు ఈ నెల 28న నేరుగా సిఎం చేతుల మీదుగా రైతుల ఖాతాలో జమవుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎన్. మల్లేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షులు అనపన పీతాంబర రెడ్డి, నీలపు ఢిల్లీ, గుజ్జు రాము, బెల్లుపడా రైతులు పాల్గొన్నారు.

జాబితాను పరిశీలిస్తున్న రైతులు